# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం-31- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 152 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




వేలేరులోని  కొనుగోలు కేంద్రం వద్ద వర్షంలో తడిసి ముద్దయిన వడ్లు



వరదల్లో చిక్కుకుని మృత్యువాత పడ్డ గేదె



హుస్నాబాద్లోని కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన వడ్లు వరదలో కొట్టుకుపోవడంతో రోదిస్తున్న మహిళ



వరద నీటిలో మునిగిన ఓరుగల్లు

## మొంథా తుఫాన్...

# రైతుల గుండెల్లో రక్తపు వర్షం!

### ఆకాశం ఏడ్చిందా? లేక భూమి కన్నీళ్లు పట్టలేక పొంగిపొర్లిందా?

### వాగులు రోదిస్తూ పొలాలను మింగేశాయి

### కళ్ల ముందు కలలు కరిగిపోయాయి!

### (తెలంగాణ ముచ్చట్లు – హృదయ విదారక ప్రత్యేక కథనం)



భారీ వర్షాలకు నేలవాలిన వరి

**హన్మకొండ,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** అది రాత్రి...గడియారం రెండు దాటింది. ఆకాశం పగిలిపోయినట్టు గర్జించింది. మొంథా తుఫాన్ రూపంలో మరణం దిగి వచ్చింది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి... వేలేరు మండలం వరకు - ఒక్కసారిగా భూమి నీటి సముద్రమైంది. హన్మకొండ నగరంలో రోడ్లు నదులుగా మారాయి. వరంగల్లో భద్రకాళి చెరువు పొంగి రహదారులు మునిగాయి. హుస్నాబాద్లో మార్కెట్ యార్డు నీట మునిగింది. ఖమ్మంలో మున్నేరు వాగు ఉప్పొంగి ఇళ్ల లోకి చేరింది. పత్తి మొక్కలు కన్నీటి ధారలా కూలిపోయాయి. వరి గింజలు చిన్న పిల్లలా నీటిలో మునిగి చనిపోయాయి. మిర్చి తోటలు ఎర్రటి రక్తంలా కనిపించి... మాయమయ్యాయి.

**వరంగల్,హనుమకొండ నగరమే చెరువయింది**

హనుమకొండలోని గోపాలపురం, టీఎన్జీవోస్ కాలనీ, భద్రకాళి చెరువు పరిసరాలు, రాత్రికిరాత్రే జలమయమయ్యాయి. అలంకార్ జంక్షన్ వద్ద చెరువు అలుగు నీరు రోడ్లపైకి పొర్లింది. వందల ఇళ్లు నీట మునిగాయి.

మిగతా 8లో



## వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం సుడిగాలి పర్యటన

- హుస్నాబాద్లో విధ్వంసం సృష్టించిన మొంథా తుఫాన్
- వేలాది ఎకరాల్లో పంట నష్టం
- వాగులు ఉద్ధృతం,రోడ్లు, కల్వర్టులు ధ్వంసం
- వాగులో గల్లంతైన దంపతుల గాలింపుకు ఎస్డీఆర్ఎఫ్ రంగంలోకి
- నేడు సిఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే !

**హుస్నాబాద్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):**

హుస్నాబాద్ నియోజకవర్గం మీదుగా దూసుకెళ్లిన మొంథా తుఫాన్ ప్రళయాన్ని సృష్టించింది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో వాగులు, చెరువులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు, కల్వర్టులు కూలిపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట నీటమునిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం వరద నీటికి కొట్టుకుపోయింది.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం హుటాహుటిన వరద ప్రభావిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. అక్కన్నపేట మండలంలోని మోత్కులపల్లె వాగు దాటుతుండగా బైక్పై వెళ్తున్న ప్రణయ్, కల్పన అనే దంపతులు గల్లంతైన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు.

మిగతా 2లో

## తుపాన్ ప్రభావిత జిల్లాల్లో ధాన్యం సేకరణపై సీఎం దృష్టి

- మొంథా తుపాను నేపథ్యంలో అత్యవసర చర్యలపై వీడియో కాన్ఫరెన్స్
- ప్రతి మండలానికి ప్రత్యేక అధికారి నియామకం
- కొనుగోలు కేంద్రాలపై దినసరి పర్యవేక్షణ ఆదేశం
- అధికారుల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవన్న సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):**

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో



## వరంగల్, హనుమకొండలో సహాయక చర్యలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

- తీవ్ర ప్రభావిత ప్రాంతాలకు తక్షణం పడవల పంపిణీకి ఆదేశం
- ఎస్డీఆర్ఎఫ్ బృందాలను వెంటనే తరలించాలన్న సీఎం సూచన
- డ్రోన్ల ద్వారా చిక్కుకున్న కుటుంబాలకు ఆహారం, నీరు సరఫరా చేయాలని ఆదేశం

2లో



## సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

- రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ
- నవంబర్ 24న బాధ్యతలు స్వీకరణ
- జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సుపై వెంటనే ఆమోదం తెలిపిన రాష్ట్రపతి
- హర్యానా నుంచి సీజేఐ పదవిని చేపట్టనున్న తొలి న్యాయమూర్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):**

సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయగా, తదుపరి రోజు నవంబర్ 24న జస్టిస్ సూర్యకాంత్ కొత్త ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

మిగతా 2లో

శుక్రవారం-31- అక్టోబర్ 2025

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# తుపాన్ ప్రభావిత జిల్లాల్లో ధాన్యం సేకరణపై సీఎం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

తుపాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ప్రతి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ నివేదికలను కలెక్టర్లకు అందజేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి, ధాన్యం సేకరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా ధాన్యాన్ని ఫంక్షన్ హాళ్ల వంటి సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. సెలవుల్లో ఉన్న అధికారులందరినీ విధుల్లోకి రప్పించాలని, నిర్లక్ష్యం చూపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, పౌర సరఫరాల శాఖ కలెక్టర్లకు నిరంతరంగా సమాచారాన్ని అందజేస్తూ సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, ప్రాజెక్టులు, చెరువులు, వాగుల వద్ద పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలకు అప్రమత్తత సూచనలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటోందని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# వరంగల్,హనుమకొండలో సహాయక చర్యలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

- తీవ్ర ప్రభావిత ప్రాంతాలకు తక్షణం పడవల పంపిణీకి ఆదేశం
- ఎస్డీఆర్ఎఫ్ బృందాలను వెంటనే తరలించాలన్న సీఎం సూచన
- డ్రోన్ల ద్వారా చిక్కుకున్న కుటుంబాలకు ఆహారం, నీరు సరఫరా చేయాలని ఆదేశం

హైదరాబాద్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):

మొంథా తుపాను తీవ్ర ప్రభావంతో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఏర్పడిన వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. వరద ముప్పు పెరిగిన ప్రాంతాలకు తక్షణం పడవలను పంపాలని, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉన్న జిల్లాల నుండి వెంటనే తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర డీజీపీకి ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. అత్యవసర సహాయక చర్యల్లో భాగంగా హైడ్రా సిబ్బందిని వినియోగించాలని, హైడ్రాలో ఉన్న వరద సహాయక సామగ్రిని వెంటనే తరలించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించడంలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని హెచ్చరించారు.

ఇళ్ల కప్పులపై లేదా ఎత్తైన భవనాల్లో చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తక్షణం ఆహారం, మంచినీరు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

వాతావరణ పరిస్థితుల కారణంగా ఈరోజు తలపెట్టిన వరంగల్ జిల్లా పర్యటనను సీఎం వాయిదా వేసుకున్నారు.నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి నష్టాన్ని స్వయంగా పరిశీలించాలని నిర్ణయించారు.







# వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం సుడిగాలి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

రెస్క్యూ చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, చీఫ్ సెక్రటరీ రామకృష్ణకు సూచనలు ఇచ్చారు. ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపును ముమ్మరం చేశాయి.

బస్వాపూర్, పోరెడ్డిపల్లి, మోయతుమ్మెద వాగు ప్రాంతాల్లో తెగిన రోడ్లు, కూలిన బ్రిడ్జిలను మంత్రి పరిశీలించి పునఃనిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో వరదకు కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలించి బాధిత రైతులకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. మహిళా రైతు వీరవ్వకు సహాయం కింద 10 వేల రూపాయలు మంత్రి అందజేశారు.

భీమదేవరపల్లి మండలంలో వరదలో మృతి చెందిన అప్పని నాగేంద్రం కుటుంబాన్ని మంత్రి పరామర్శించి సానుభూతి తెలిపారు. గట్ల నర్సింగాపూర్ వద్ద తెగిన కల్వర్టును పరిశీలించారు. ఇందుర్తి మండలంలో లెవెల్ బ్రిడ్జి మునిగిపోవడంతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మొంథా తుఫాన్ విపత్తు మిగిల్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ ప్రాంతంలో జరిగిన నష్టం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. రేపు ముఖ్యమంత్రి హుస్నాబాద్, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు.ఈ విపత్తును జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్రం రాష్ట్రానికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రైతులకు అండగా ఉంటామని, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ప్రజలతో ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్



(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న సూర్యకాంత్ నియామకానికి సంబంధించి బీఆర్ గవాయ్ బుధవారం కేంద్ర న్యాయశాఖకు సిఫార్సు చేసిన వెంటనే రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించారు.

జస్టిస్ సూర్యకాంత్ నియామకంపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ అభినందనలు తెలిపారు. రాజ్యాంగం ప్రసాదించిన అధికారాల మేరకు రాష్ట్రపతి ఈ నియామకం చేపట్టారని ఆయన వెల్లడించారు. నవంబర్ 24న బాధ్యతలు స్వీకరించనున్న సూర్యకాంత్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

హర్యానాకు చెందిన జస్టిస్ సూర్యకాంత్, గతంలో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అంతకు ముందు పంజాబ్, హర్యానా హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలందించారు. 2019 మేలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన ఆయన, హర్యానా నుంచి చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా బాధ్యతలు చేపట్టనున్న తొలి న్యాయమూర్తిగా గుర్తింపు పొందనున్నారు.

సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, రాజ్యాంగ పరమైన అంశాలపై ఆయనకు బలమైన పట్టుంది. అనేక కీలక రాజ్యాంగ ధర్మాసనాల్లో భాగస్వామ్యమై పలు చారిత్రాత్మక తీర్పులు ఇచ్చిన సూర్యకాంత్, ప్రధాన న్యాయమూర్తిగా 14 నెలలపాటు కొనసాగనున్నారు. ఈ కాలంలో ఎన్నికల సంస్కరణలు, క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, డిజిటల్ ప్రైవసీ వంటి కీలక అంశాలపై విచారణలు జరిగే అవకాశం ఉంది.

# అజారుద్దీన్‌పై బీజేపీ–బీఆర్ఎస్ కుట్ర: భట్టి విక్రమార్క ఆరోపణ

- క్రీడాకారుడిగా దేశ కీర్తిని చాటిన వ్యక్తికి న్యాయం చేయాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 30:

ప్రఖ్యాత క్రికెటర్, మాజీ భారత కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్‌ను మంత్రి వర్గంలోకి తీసుకోకుండా బీజేపీ కుట్రలు చేస్తోందని ప్రతిపక్ష నేత భట్టి విక్రమార్క మల్లూ ఆరోపించారు. ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ వ్యాఖ్యలు చేశారు. భట్టి పేర్కొంటూ, దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిన అజారుద్దీన్‌కు రాజకీయంగా తగిన గౌరవం ఇవ్వకుండా కుట్రలు పన్నుతున్నారని, బీజేపీతో పాటు బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. అజారుద్దీన్ దేశ క్రికెట్ జట్టుకు సుదీర్ఘకాలం కెప్టెన్‌గా సేవలందించారని, ఆయన దేశ క్రీడా రంగానికి చేసిన సేవలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని భట్టి మల్లూ వ్యాఖ్యానించారు. "విఖ్యాత క్రీడాకారుడికి అవకాశం ఇవ్వడాన్ని బీజేపీ అడ్డుకుంటుంది" అని ఆయన విమర్శించారు. అజారుద్దీన్‌లాంటి క్రీడా దిగ్గజం ప్రజాసేవలోకి రావడం సమాజానికి మేలు చేస్తుందని భట్టి పేర్కొన్నారు.

# ముష్కిన్ చెరువు అభివృద్ధి.. సీఎస్ఆర్ నిధుల వినియోగానికి ఆదర్శం కావాలి

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచనలు

హైడ్రాబాద్, అక్టోబర్ 30 :



హైడ్రాబాద్ పరిధిలోని నార్సింగి మండలంలోని ముష్కిన్ చెరువు అభివృద్ధి సీఎస్ఆర్ నిధుల వినియోగానికి ఆదర్శంగా మారాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. తత్వ డెవలపర్స్ సంస్థ సామాజిక బాధ్యత నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ముందుగా చెరువు హద్దుల మార్కింగ్‌లో ఆలస్యం కావడంతో పనులు నిలిచిపోయినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ రంగనాథ్, సుమారు 60 ఎకరాల ప్రభుత్వ భూముల సర్వే పూర్తి చేసి, అనధికార ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువు పరిసర కాలనీల నివాసితులు, దేవాలయ కమిటీ సభ్యులు, రైతులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, తత్వ డెవలపర్స్ ప్రతినిధులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న రైతులకు టీడీఆర్ కింద నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాల సమయంలో చెరువులోకి నీరు చేరే మార్గాలు, ఔట్‌లెట్ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మించి, మొక్కలు నాటి, ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులు కొనసాగించాలని తత్వ సంస్థకు ఆదేశించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అజారుద్దీన్‌కి మంత్రి పదవి ఆఫర్ : బీజేపీ తీవ్ర ఆక్షేపణ

- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 30:

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేడెక్కుతున్న తరుణంలో, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఆఫర్ చేశారనే వార్తలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఆఫర్ ఇచ్చారనే మీడియా కథనాలను ప్రస్తావిస్తూ, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన అని బీజేపీ ఆరోపించింది. బీజేపీ తెలంగాణ యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ, "ఒక వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు మంత్రి పదవి ఆఫర్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇలాంటి ప్రకటనలు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే దుష్ప్రయత్నాలు" అని తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో అధికార పార్టీ చేపడుతున్న అనైతిక చర్యలను తక్షణమే అడ్డుకోవాలని, తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎన్నికల సంఘానికి అధికారిక ఫిర్యాదు సమర్పించింది. రాష్ట్రంలో సమాన స్థాయిలో ఎన్నికలు జరగాలంటే ఇటువంటి చర్యలకు తావు లేకుండా చూడాలని పార్టీ డిమాండ్ చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అజారుద్దీన్ పేరు వినిపించడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఒకవైపు కాంగ్రెస్ తమ బలం పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంటే, మరోవైపు బీజేపీ ఎన్నికల నియమాల ఉల్లంఘనపై గళమెత్తడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "అజారుద్దీన్‌కి మంత్రి పదవి ఆఫర్ చుట్టూ చెలరేగిన వివాదం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది" అని వ్యాఖ్యానిస్తున్నారు.



Dr. Shyamprasad Mukherjee Bhavan, Opp. Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.
Office: 040-24653535, 24653311, Fax: 040-24653929, e-mail: bjptsonline@gmail.com

October 30, 2025

To
The Chief Electoral Officer,
Telangana State,
Hyderabad.

Respected Sir,

**Sub: Gross violation of Model Code of Conduct by the Chief Minister of Telangana to appease a section of voters in Jubilee Hills Bye-election – Action requested – Reg.**

We have just noticed through TV and newspapers that there is a proposal to offer ministry to Mr. Mohammed Azharuddin. This proposal is nothing but to woo and garner the votes of a section of the voters in the upcoming Jubilee Hills bye-elections. This proposal at this stage is an utter violation of the Model Code of Conduct even though M.C.C. is not applicable to the entire city of Hyderabad, the alleged announcement, if any, made by the Hon'ble Chief Minister would adversely affect the bye-election in the Jubilee Hills constituency. It may also be pertinent to note that Mr. Mohammed Azharuddin had contested as a candidate from Jubilee Hills constituency in 2023 assembly elections.

It is, therefore, requested to take cognisance of the alleged announcement by the state Chief Minister i.e., offering ministry to Mr. Mohammed Azharuddin, which is made with a mala fide intention to woo a section of voters in the Jubilee Hills assembly constituency, which attracts violation of Model Code of Conduct, and take immediate action to withdraw such an announcement.

Thanking you,

Yours sincerely,

(Payal Shanker)
M.L.A. BJLP Dy. Floor Leader

(Marri Sashidhar Reddy)
Chairman-BJP Election Commission Affairs Committee

(K. Anthony Reddy)



# అక్రమ వలసదారులకే కాంగ్రెస్ రక్షణ

- గోరక్షకులపై తప్పుడు కేసులు: కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- ప్రభుత్వం చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే వారినే వేధిస్తోంది
- కేంద్ర మంత్రి ఆరోపణ

హైదరాబాద్, అక్టోబర్ 30 :



భారతదేశంలో ప్రజల భద్రతకు కట్టుబడి ఉండాల్సిన ప్రభుత్వం, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. అక్రమంగా దేశంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు, అక్రమ వలసదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచంలా మారిందని ఆయన ఆరోపించారు. దేశ ప్రజలకంటే అక్రమ వలసదారులకే కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ ఇస్తోంది. అక్రమంగా గోవులను తరలిస్తూ, చంపి, వాటి మాంసాన్ని మోసపూరితంగా విక్రయిస్తున్న సంఘవిద్రోహ శక్తులను అడ్డుకోవాల్సింది పోయి, వారినే కాపాడుతోంది అని అన్నారు. గోరక్షకులపై తప్పుడు కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి, జైలులో వేయడం ద్వారా ప్రభుత్వం తన అసలు స్వరూపాన్ని బయటపెడుతోంది అని ఆయన మండిపడ్డారు. గోరక్షకులు దేశ చట్టాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తుండగా, వారిపై తప్పుడు ఆరోపణలు మోపడం కాంగ్రెస్ పాలనలో కొత్త పంథాగా మారిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి మరోసారి హితవు పలుకుతూ, "ప్రజలపై తుపాకులతో దాడి చేస్తున్నవారిని ప్రభుత్వం మన్నిస్తూ, చట్టానికి కట్టుబడి ఉన్న వారిని శిక్షిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ" అని అన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే, వారినే ఇబ్బంది పెట్టడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోందని ఆయన పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో తెలంగాణలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై బీజేపీ తరచూ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో, ఆయన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# పోలిశెట్టి బాబురావుకు ఘన నివాళులు

**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు) :** ఏఎస్ రావునగర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త, క్రాంతి బిల్డర్స్ ప్రొప్రైటర్ స్వర్గీయ పోలిశెట్టి బాబురావు దశదిన కర్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బాబురావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భాను ప్రసాద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, నాయకులు బండారి నీలం రెడ్డి, దామోదర్ రావు, పోలిశెట్టి శ్రీనివాస్, పోలిశెట్టి రవి, పోలిశెట్టి కళ్యాణ్, మధు తదితరులు పాల్గొన్నారు.పోలిశెట్టి బాబురావు నిర్మాణరంగంలో చిరస్మరణీయ సేవలందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించారని పలువురు ప్రసంగించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.



# హోమీ జే. బాబా 116వ జయంతి వేడుకలు

**ఏ ఎస్.రావు నగర్, అక్టోబర్ 30 ( తెలంగాణ ముచ్చట్లు):** భారత అణు పితామహుడు డాక్టర్ హోమీ జే. బాబా 116వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ కార్యాలయంలో గురువారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు.డాక్టర్ బాబా చిత్రపటానికి ఎన్ఎఫ్సీ సీనియర్ నాయకులు ఉదయ భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడిన ఆయన భారత అణు రంగ అభివృద్ధిలో డాక్టర్ బాబా పాత్ర అపారమని కొనియాడారు. అణు పరిశోధనలో భారతదేశానికి శాశ్వత పునాదులు వేసిన శాస్త్రవేత్తగా ఆయనను గౌరవించాలన్నారు.ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ నాయకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ జీవితాంతం అణు శక్తి, పరిశోధన రంగాల అభివృద్ధికి కృషి చేసిన మహానుభావుడే హోమీ జే. బాబా అని పేర్కొన్నారు. దేశ రక్షణ, అణు విద్యుత్ రంగాలకు ఆయన చేసిన కృషి అమోఘమని చెప్పారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీతగా దేశానికి గౌరవం తెచ్చేలా పనిచేశారన్నారు.కార్యక్రమంలో జి. శివరామకృష్ణ, ఎం. భాస్కర్ రావు, గిరీష్, గొడుగు యాదగిరి రావు తదితరులు మాట్లాడారు. అనంతరం సభ్యులందరూ హోమీ జే. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జె. చంద్రశేఖర్ రావు, ఎం. శ్రీనివాస్ రావు, ఎం. శ్రీనివాస్, అశోక్, శోభ, గౌసియా, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- ప్రభుత్వ హామీ అమలు చేయాలని డిమాండ్ ఉన్నికృష్ణన్

**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు డిమాండ్ చేశారు.గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉన్నికృష్ణన్ కె., కార్యదర్శి ప్రేమలత మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండగ రోజున కూడా కుటుంబాలు పస్తులయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎన్నికల ముందు కార్మికులకు రూ.10,000 వేతనం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ వాగ్దానం ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. నెలల తరబడి వేతనాలు రాకపోతే వంట ఎలా చేస్తారని ప్రశ్నించారు. కొత్త మెనూ పేరుతో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.
కార్మికులు విద్యార్థులను తమ కుటుంబసభ్యుల్లా భావించి నాణ్యమైన భోజనం అందిస్తున్నారని, ప్రభుత్వం ఈ సేవాభావాన్ని గుర్తించి వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని మెనూ చార్జీలను పెంచాలని, అంగన్‌వాడీ మాదిరిగా గుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలని, ఉచిత గ్యాస్, కాటన్ యూనిఫామ్ అందించాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయడమేగాక ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, యూనియన్ నాయకులు విజయలక్ష్మి, మంజుల, జయ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం






**నాచారం, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని వీ.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఘట్కేసర్ ఏసీపీ చక్రపాణి, సీఐ బాలస్వామి, ఎస్ఐ హీనా పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలన్నారు. సమాజంలో రక్తదానం అత్యంత మహత్తర సేవ అని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.శిబిరంలో ఘట్కేసర్ మైనార్టీ యువత, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థలు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతల తో పాటు పోలీస్ సిబ్బంది కూడా రక్తదానం చేస్తూ సేవాస్ఫూర్తిని చాటారు.

# చిన్నారుల ఆకలి తీర్చిన అంగన్వాడిలు





## అభినందించిన మంత్రి సీతక్క

**హన్మకొండ,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండలోని సమ్మయ్యనగర్, అమరావతినగర్, టీవీ టవర్ ప్రాంతాలు ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ కష్టకాలంలో వరద ప్రభావిత ప్రాంతాల నుండి రక్షించబడిన చిన్నారుల ఆకలి తీర్చడానికి అంగన్వాడీ సిబ్బంది విశేష సేవలు అందించారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు స్వయంగా వేడి వేడి బాలామృతం వండి చిన్నారులకు అందించారు. మంగళవారం అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినప్పటికీ, సిబ్బంది విధుల్లోనే కొనసాగి వరద ప్రభావిత ప్రాంతాల్లో పిల్లల బాగోగులు చూసుకున్నారు. వారు తమ సొంత వనరులతో వండిన ఆహారాన్ని ప్రభావిత ప్రాంతాలకు తీసుకెళ్లి చిన్నారులకు వడ్డించారు. అంగన్వాడీ సిబ్బంది చూపిన ఈ మానవతా దృక్పథంతో కూడిన సేవాభావాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. "అవసర సమయంలో ప్రజల కోసం అంగన్వాడీలు ముందుకు రావడం, చిన్నారుల ఆకలి తీర్చడం గొప్ప సేవ" అని ఆమె ప్రశంసించారు. అంగన్వాడీ వ్యవస్థ సామాజిక సేవలో ఒక కాంతి దీపంలా నిలుస్తోందని పేర్కొన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో కూడా అంగన్వాడీ సిబ్బంది చూపిస్తున్న నిబద్ధత, సేవా మనోభావం పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా కూడా అభినందనలు తెలియజేశారు.

# భీమారం బొడ్రాయి ప్రాంతంలో నీట మునిగిన గృహాలు





- అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రజా సమస్యలను పట్టించుకోవాలి.

**హసన్ పర్తి, అక్టోబర్ 30(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ పరిధి భీమారంలోని శ్యామలచెరువు నాలా కబ్జాపై పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, గురువారం రోజున ఆందోళన చేయడంతో విషయం తెలిసిన కేయూ ఇన్స్పెక్టర్ సుంకరి రవికుమార్,తహశీల్దారు చల్ల ప్రసాద్, హుటాహుటిన ఘటనా స్థలానికి చేరు కొన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న తుఫాన్ కారణంగా శ్యామలచెరువు నుండి మత్తడి పడడంతో భీమారం గ్రామంలోని బొడ్రాయి ప్రాంతంలో గల ప లుకాలనిలు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శ్యామలచెరువు నాలా స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేయడంతో వరద నీరు నిలిచి కాలనీలో గృహాలు మునిగి కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాకు గురైన నాలాపై కట్టిన గోడను జెసిబి సహాయంతో తొలగించారు .ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డునూరి యాదగిరి మాట్లాడుతూ మునుముందు ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రజా సమస్యలను పట్టించుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. అదేవిధంగా శ్యామలచెరువు నీరు కట్ట కాలువ ద్వారా చింతగట్టు క్యాంపులోని పెండ్లి వాగు చేరడంతో క్యాంపులోని ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కార్పొరేషన్ జెసిబి సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు,సంఘాల విక్టరీ బాబు, టిఆర్ఎస్ డివిజన్ డివిజన్ వాటికం రవీందర్,గుంజే సాయికుమార్,గ్రామ అధ్యక్షుడు రాయికంటి సురేష్, నాటి సమ్మయ్య,కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం తదితరులు పాల్గొన్నరు.

# గంజాయి పీలుస్తూ పట్టుబడ్డ ఇద్దరు యువకులు

**సత్తుపల్లి, అక్టోబరు 30 (తెలంగాణ ముచ్చట్లు):** చెడు స్నేహాల బారిన పడి మత్తు మాయలో మునిగిపోయిన ఇద్దరు యువకులు గంజాయి పీలుస్తూ పట్టుబడ్డారు. పోలీసులు వారివద్ద నుండి వంద గ్రాముల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన సత్తుపల్లి పరిధిలో చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం —— సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన కువ్వారపు సతీష్ కుమార్ (వయస్సు 20 సంవత్సరాలు, వేంకటేశ్వరరావు కుమారుడు, మాదిగ, రంగులు వేసే పనివాడు) మరియు మరో 17 సంవత్సరాల వయస్సు గల మైనర్ బాలుడు చెడు స్నేహితుల ప్రభావానికి లోనై గత నాలుగేళ్లుగా తాగుడు, గంజాయి పీల్చడం అలవాటు చేసుకున్నారు.
వీరు గతంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద చిన్న పొట్లాలలో గంజాయి కొనుగోలు చేసేవారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని తెలుసుకున్న వీరు అక్టోబరు 25వ తేదీ రాత్రి సత్తుపల్లి నుండి బయలుదేరి ఆవులపాక గ్రామానికి వెళ్లి, భగవాన్ అనే వ్యక్తి వద్ద నుండి అర కిలో గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం ఇద్దరూ కలిసి ఆ గంజాయిని పీల్చారు.



ఈ రోజు కూడా మెట్ట ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని వైకుంఠ ధామం వద్ద గంజాయి పీల్చిన తరువాత, మరలా కొనుగోలు చేసేందుకు డబ్బుల కొరకు మిగిలిన గంజాయిని అమ్ముదామని నిర్ణయించారు. ఇద్దరూ కలిసి గంజాయి పొట్లాను మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్‌లో దాచుకొని ప్రయాణిస్తుండగా, పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంటపడి పట్టుకున్నారు.
వారి వద్ద నుండి వంద గ్రాముల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై మత్తు పదార్థాల నియంత్రణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచారు.
ప్రభుత్వం గంజాయి నిరోధక కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఎవరైనా గంజాయి కొనుగోలు చేసినా, అమ్మినా లేదా పీల్చినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇట్టి అక్రమ చర్యల గురించి సమాచారం అందజేసే వారికి తగిన బహుమతి ఇవ్వబడుతుందని, వారి పేర్లను రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ కేడల ప్రసాద్ నియామకం



**వరంగల్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లా ఖిల వరంగల్ మండలం రంగశాయిపేటకు చెందిన సామాజిక వేత్త డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్‌ను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆ కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కేడల ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు రూపుమాపడానికి సమాచార హక్కు చట్టం ప్రజలకు బలమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రజలు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే సమాజంలో పారదర్శకత నెలకొంటుందని తెలిపారు. అవినీతి, అక్రమాలను వెలికితీసి న్యాయస్థానాల ద్వారా అరికట్టడమే కాకుండా, నిరుపేదలకు న్యాయసలహా, సేవలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం, పేదలకు ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేయడం, అన్ని శాఖల్లో ఆర్టీఐ చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యేలా పర్యవేక్షించడం కమిటీ ముఖ్యమైన విధానాలుగా వివరించారు. విద్యా, వైద్య రంగాల్లో ఉన్న లోపాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ప్రమాణాలు మెరుగుపరచడం, మానవ హక్కుల ఉల్లంఘనలను నిరోధించడం, ప్రజా ఆస్తులను కాపాడడం కూడా కమిటీ కర్తవ్యమని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరూపించి దోషులను వెలుగులోకి తేవడమే కాకుండా రాజీ లేని పోరాటం సాగిస్తామని ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూముల లెక్క తేల్చి ప్రజా ఆస్తుల రక్షణకు కృషి చేస్తామని చెప్పారు.

ఈ సంస్థ ఎటువంటి రాజకీయ పార్టీకి లేదా ఇతర సంస్థలకు అనుబంధం కాదని, మానవ హక్కులను కాపాడడం, మానవ సంబంధాలను మెరుగుపరచడం, మానవత్వాన్ని పంచడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మిత్రులు ఆయనను అభినందించారు.

# దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీకి తరలిరావాలి

- గవాయ్ పై దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగానే చూస్తం.
- తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ.



**హైదరాబాద్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై ఇటీవల జరిగిన దాడిని రాజ్యాంగం పై జరిగిన దాడిగానే చూస్తామని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ అన్నారు. గురువారం హైదరాబాదులోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తి పై దాడి జరిపిన వ్యక్తిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వ్యక్తిపై నేటికీ కేసు నమోదు చేయకపోవడం దళితులను అవమానించడమేనని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో దళితులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. నవంబర్ 1న హైదరాబాదులో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీకి దళితులు, జర్నలిస్టులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లెపాక రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్, రాష్ట్ర నాయకులు బొట్ల సదానందం ఉన్నారు.





# బి గంగారంలో 15వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం వైభవంగా.!

**సత్తుపల్లి, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం బి.గంగారం గ్రామంలోని 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో గురువారం పోలీసు జెండా దినోత్సవం-2025 కార్యక్రమాల లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో ఉన్న వివిధ రకాల ఆధునిక తుపాకులను విద్యార్థులకు ప్రదర్శించారు. తుపాకుల సామర్థ్యాలు, పనితీరును వీడియో ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరించారు. తరువాత బెటాలియన్ కమాండెంట్ ఏ. అంజయ్య మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జెండా దినోత్సవ కార్యక్రమాల లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు తుపాకుల గురించి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని వివరించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఉప కమాండెంట్లు ఎస్. శ్రీధర్ రాజా, యస్. డి. రంగారెడ్డి, విశ్వశాంతి పాఠశాల నిర్వాహకుడు బి. నాగేశ్వరరావు, డి.ఏ.వి. పాఠశాల, గంగారం హై స్కూల్, విశ్వశాంతి పాఠశాల యాజమాన్య సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, కానిస్టేబుళ్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రజల ఆవేదన వినండి ఎన్నికలు పక్కనపెట్టి సహాయక చర్యలు చేపట్టండి

### ఈటల రాజేందర్ డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** తుఫాన్ కారణంగా తెలంగాణ రైతులు తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా విమర్శించారు. సీఎం దందాలు వసూలు పక్కనపెట్టి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రెస్ మీట్‌లో మాట్లాడిన ఈటల రాజేందర్ మాట్లాడుతూ తాజా తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పత్తి, వరి, మక్క పంటలు దెబ్బతిన్నాయని, గత వర్షాలకే రోడ్లు దెబ్బతిన్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని అన్నారు. "భీమదేవరపల్లి మండలంలో 41 సెంటీమీటర్ల వర్షం పడింది. వరంగల్‌లో పలు ప్రాంతాలు ఆరు అడుగుల నీటిలో మునిగిపోయాయి. రైతులు కన్నీళ్లతో ఉన్నారు, గ్రామాల్లో విషాదం నెలకొంది," అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి స్వయంగా ప్రజలను ఆదుకుంటున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం అధికార రాజకీయాలకే పరిమితమైందని అన్నారు. ఈటల డిమాండ్లు: పంట మరియు ఇళ్ల నష్టాన్ని వెంటనే అంచనా వేయాలి .నష్టపోయిన రైతులకు, కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి.

వర్షం వల్ల కోల్పోయిన గృహోపకరణాలకూ పరిహారం కల్పించాలి. అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని పక్కనపెట్టి తుఫాన్ బాధితులకు సహాయం చేయాలి

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై విమర్శలు: రాష్ట్ర ప్రభుత్వం పది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి ఉంచిందని ఈటల ఆరోపించారు. "డబ్బులు ఇవ్వడం లేదని కళాశాలలు విద్యార్థులను వేధిస్తున్నాయి. పేద విద్యార్థులు పై చదువులు కొనసాగించలేని స్థితి వచ్చింది," అని తెలిపారు. కాలేజీలపై బెదిరింపు చర్యలు మానుకుని వెంటనే బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం పై తీవ్ర విమర్శలు: ప్రజా సమస్యలు పక్కనబెట్టి అంతర్గత గొడవలు, రాజకీయ దందాలలో మునిగిపోయారని ఈటల మండిపడ్డారు. "అధికారం శాశ్వతం కాదు. ప్రజలు ఇప్పుడు మౌనం పాటిస్తున్నారని అనొద్దు — సమయం వచ్చినప్పుడు వారు సమాధానం చెబుతారు," అని హెచ్చరించారు.

రైతులు, విద్యార్థులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఈ సమయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





# పంటలను పరిశీలించిన సిపిఐ బృందం

- తుపాను ప్రభావంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం
- జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్
- హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె.బిక్షపతి

**ఎల్కతుర్తి. అక్టోబర్ 30( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, కంది, చిరుధాన్యాలు దెబ్బతిన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఎల్కతుర్తి మండలంలోని గోపాలపూర్ గ్రామంలో ఊట్కూరి ప్రభాకర్కు చెందిన కోళ్ల ఫార్మ్‌లో నీరు చేరి దాదాపు రూ.3 లక్షల విలువైన కోడి పిల్లలు చనిపోయాయి. అదే విధంగా పెండ్యాల సాంబయ్యకు చెందిన రెండు ఎకరాల వరి నేలకొరిగింది. పోలేని శ్రీనివాసరావు వరి పొలాలు నీటమునిగాయి. పెండ్యాల నాగరాజుకు చెందిన మూడు లెగ దూడలు తాళ్లవాగులో కొట్టుకుపోయాయి.



అలాగే బావుపేటకు చెందిన పోలాటి సంపత్ రావు 150 వరి బస్తాలు ప్రవాహ జలాలతో కొట్టుకుపోయాయని ఆయన వివరించారు. "ఇలాంటివి జిల్లాలో ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయి. రైతులు అపారమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ తుపాను రాష్ట్రాన్ని నిండుగా ముంచింది. ప్రభుత్వం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి, రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి" అని కర్రె బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వుట్కూరి రాములు, దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, సిపిఐ గ్రామ కార్యదర్శి సూర మొగిలి, సహాయ కార్యదర్శులు జూపాక రవీందర్, కర్రె రాజు, రైతు నాయకులు కోదాటి రాజేశ్వరరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరిలో తృటిలో తప్పిన ఘోర ప్రమాదం!



- కొండపైభాగం నుంచి జారి చెత్త బండిపై పడ్డ పెద్ద బండరాయి
- పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్న స్థానికులు

**మల్కాజ్‌గిరి, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్‌గిరి నియోజకవర్గం గౌతమ్‌నగర్‌లో ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. మల్లికార్జున నగర్ మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న కొండపైభాగం నుంచి భారీ బండరాయి కిందకు జారిపడి మున్సిపల్ చెత్త బండి మీద పడింది. రాయి బలానికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తూ ఘటన సమయంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

రోడ్డుమధ్యలో బండరాయి పడిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రతి శనివారం ఇదే ప్రాంతంలో కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారని, ఆ సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే తీవ్రమైన ప్రమాదం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

కొండపై ఇంకా ప్రమాదకరంగా ఉన్న రాళ్లను తక్షణమే తొలగించాలని, భద్రతా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. 1985లో ఇదే ప్రాంతంలో భారీ రాళ్లను తొలగించి రోడ్డును విస్తరించిన విషయాన్ని పెద్దలు గుర్తు చేసుకున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని ట్రైన్ అండ్ బస్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ మున్సిపల్, జిహెచ్ఎంసి అధికారులను కోరారు.



## వేలేరు మండలంలో నీటమునిగిన పంటలు,ఆవేదనలో రైతులు

**వేలేరు,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. గ్రామాల మధ్యకు, ఇళ్లలోకి ప్రవహించిన వర్షపు నీటితో పంటలు విస్తారంగా నీట మునిగిపోయాయి. ఐకేపీ కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి పాడవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరునెలల కష్టఫలంగా పండించిన పంటలు వర్షాల బీభత్సంతో నీటి పాలయ్యాయని, అప్పుచేసి వేసిన పంట ఇలా చెడిపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని రైతులు వాపోయారు. తమ నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

---



## వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీగోడ

**విద్యార్థుల భద్రతపై ఆందోళన**

**వేలేరు,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలోని పీచర గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ కూలిపోయింది. బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద నీరు తీవ్రంగా చేరడంతో గోడ కుంగి కూలినట్లు సమాచారం. అదృష్టవశాత్తూ ఘటన సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.ప్రహరీగోడ ధ్వంసం కావడంతో పాఠశాల ప్రాంగణం చుట్టూ భద్రతా సమస్యలు తలెత్తాయి. విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. చుట్టుపక్కల గ్రామస్థులు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని గోడ పునర్నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

---




## కుషాయిగూడలో అమరవీరు ల సంస్మరణ ర్యాలీ

**కుషాయిగూడ, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల లో భాగంగా కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈసీఐఎల్ క్రాస్ రోడ్ నుండి తాళ్లూరి క్రాస్ రోడ్ వరకు సాగిన ఈ ర్యాలీలో సుమారు 90 మంది కళాశాల విద్యార్థులు, యువత మరియు స్థానికులు పాల్గొన్నారు. తాళ్లూరి క్రాస్ రోడ్ వద్ద అమరవీరులకు ఒక నిమిషం మౌన నివాళి అర్పించారు. అనంతరం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎన్. రామ లక్ష్మణ రాజు మాట్లాడుతూ... దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారాయన. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందేలా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ట్రాఫిక్ అవగాహన కీలకమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌హెచ్‌ఓ ఎన్. రామ లక్ష్మణ రాజు, ఎస్ఐలు జి. మధు, లింగారెడ్డి, భాస్కర్ తదితరులు విజయవంతంగా నిర్వహించారు.

---



## వేలేరులో వర్షా ల బీభత్సం, విరిగిన మిషన్ భగీరథ పైపులైన్

**వేలేరు,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** ముంథా తుఫాన్ ప్రభావంతో నిన్న కురిసిన భారీ వర్షాలు వేలేరు మండలంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మండలకేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలోని వాగు భారీగా ఉధృతంగా ప్రవహించడంతో, అక్కడ గల మిషన్ భగీరథ పైపులైన్ వరద ప్రవాహానికి తట్టుకోలేక విరిగిపోయింది.దీంతో గ్రామంలో త్రాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ సిబ్బంది వెంటనే స్పందించి పైపులైన్‌ను మరమ్మతు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి త్వరలో ఇంటి నెంబర్లు





**మూడు వారాల్లో అందజేస్తామని కమిషనర్ వెంకట్‌రెడ్డి హామీ**

**దమ్మాయిగూడ, అక్టోబర్ 30, (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల గ్రామ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మౌలిక వసతుల సమస్యలు అధికమై ఉండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో సంవత్సరాలుగా డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సదుపాయాలు అందుబాటు లో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు తెలిపారు. ఇంటి పట్టాలు అందించినా, ఇంటి నెంబర్లు ఇవ్వకపోవడంతో రాత్రి వేళల్లో అసాకర్యాలు ఎదురవుతున్నాయి, చీకట్లో ప్రమాదాల భయంతో జీవిస్తున్నామని వారు విన్నవించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని కలిసి తమ గోడును తెలియజేశారు.సమస్యలపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ లక్ష్యం ప్రతి కాలనీకి మౌలిక వసతులను కల్పించడం అని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉన్న లోపాలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఇంటి నెంబర్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన కమిషనర్, మూడువారాల్లో కాలనీలో అన్ని ఇండ్లకు నెంబర్లు కేటాయిస్తాం అని స్పష్టం చేశారు. తదుపరి డ్రైనేజీ, తాగునీరు, రహదారులు వంటి వసతుల మెరుగుదలపై కూడా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.కమిషనర్ హామీతో కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు కొల బాల్ రాజ్ యాదవ్, నేతలు బోడ శ్రీనివాస్, రమేష్‌గౌడ్, కాలనీ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

---

# భక్తి శ్రద్ధలతో అయ్యప్ప ఆలయ దశమ వార్షికోత్సవం.!





**సత్తుపల్లి, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని జేవీర్ పార్క్ ఎదురుగా ఉన్న హరిహరాత్మజ అయ్యప్ప స్వామి ఆలయంలో దశమ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో భక్తి భావంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించగా, ప్రధాన అతిథిగా హాజరైన తెలంగాణ (టిజిఐడిసి) చైర్మన్ మువ్వా విజయబాబు స్వామి చేతులమీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. తరువాత నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన స్వయంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా మువ్వా విజయబాబు స్వామి మాట్లాడుతూ, అయ్యప్ప భక్తుల సేవ చేయడం ఎంతో పుణ్య కార్యం. భక్తి, విశ్వాసంతో ముందుకు సాగితే ప్రతి మనిషి జీవితంలో విజయాలు సాధ్యం అవుతాయి అని తెలిపారు.
ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. భజనలు, నామసంకీర్తనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం అలముకుంది. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు భక్తి ఉత్సాహంతో అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మువ్వా విజయబాబు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

---



# వల్లభాపురంలో మొంథా తుఫాన్ భీభత్సం



- **కూలిన ఇండ్లు,నిరాశ్రయులైన పలు కుటుంబాలు**

**ఎల్కతుర్తి,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో బుధవారం కురిసిన భారీ వర్షాలు గ్రామంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో మట్టి బీటలు వేసి రెండు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి.పోతిరెడ్డి ప్రభాకర్ తండ్రి కొమురయ్య, పడిదల స్వామిరావు తండ్రి రాజేశ్వరరావు గృహాలు ధ్వంసమయ్యాయి. ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు మొత్తం నీటిలో మునిగి నాశనమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.
అలాగే ఆళ్ళ రాంబాబు తండ్రి ఓదెలు ఇంటి బాత్రూమ్‌లు కూలిపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వర్షాల బీభత్సంతో నిరాశ్రయులైన బాధితులు ప్రభుత్వం వెంటనే పునర్నిర్మాణ సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

---

# వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి







- **సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి**

**పెద్దమందడి,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** రైతులు ప్రభుత్వ ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సింగిల్ విండో సొసైటీ సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్దమందడి మండల కేంద్రంతో పాటు పామిరెడ్డిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రతి రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతులు ధైర్యంగా తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సకాలంలో తరలించి కొనుగోలు చేస్తాం అని తెలిపారు.
అలాగే ఆయన రైతులకు సూచిస్తూ..దళారుల మాటలు నమ్మొద్దు, మోసపోవద్దు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మితేనే న్యాయమైన ధర లభిస్తుంది అని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలోనే వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే ప్రణాళిక సిద్ధంగా ఉంది. త్వరలోనే మిగతా గ్రామాల్లో కూడా కేంద్రాలను ప్రారంభిస్తాం అని విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సైజయ్య యాదవ్, సీఈఓ జగదీశ్వర్ రెడ్డి, సుధాకర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఐ. సత్యా రెడ్డి, మాజీ ఎంపీపీ మన్మత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు నరేష్, మణిగిల్ల రామిరెడ్డి, మన్యంకొండ మాజీ సర్పంచ్ కొండ రవీందర్ రెడ్డి, సిద్దయ్య, శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ నాగేంద్రరావు, ప్రవీణ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, అలాగే వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## పేదల సమస్యలకు పరిష్కారం కావాలి

- సబ్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన సిపిఐ(ఎం) నాయకులు.

**సత్తుపల్లి, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, స్థానిక సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన పేదలు సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా సిపిఐ(ఎం) సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కాకర్లపల్లి గ్రామ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను సింగరేణి మట్టితో పూడ్చి పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఇరుకైన గదుల్లో జీవనం సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
సిపిఐ(ఎం) సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. బోడు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని, గ్రామంలోని నిరుపయోగంగా ఉన్న కోనేరు (నీటి కుంట)ను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.
పైన తెలిపిన సమస్యల పరిష్కారానికి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కి వినతి పత్రం అందజేశారు. సమస్యలపై తగిన చర్యలు తీసుకుంటానని, కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తారని ఆయన హామీ ఇచ్చారు.
తరువాత ఎన్ఎస్పీ బస్టాప్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సిపిఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, ఐద్వా డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, మండల కమిటీ సభ్యులు అయినంపూడి సనందన్‌రావు, కువారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, బెజవాడ లక్ష్మీనారాయణ, కిష్ట లక్ష్మి, రజియా, యాకుబ్ పాషా, వారాల కుమారి, కొనపాకుల రాజు, బొమ్మన బోయిన భాగ్యలక్ష్మి, ఎర్రగొర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఖిల్లా ఘనపూర్ బిఆర్ఎస్ నాయకులు

- మాగంటి సునీతమ్మ గెలుపు కోసం ఖిల్లా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం
- రాళ్ల కృష్ణయ్య బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు

**ఖిల్లా ఘనపూర్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా 158వ డివిజన్ పరిధిలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీతమ్మ గెలుపు కోసం పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకుని, అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.
నాయకులు మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో సాధించిన అభివృద్ధి, వ్యవసాయ, విద్యా, ఆరోగ్య రంగాల్లో తీసుకువచ్చిన మార్పులు ప్రజల జీవితాలను మెరుగుపరిచాయని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతమ్మ గెలుపు అవసరమని చెప్పారు.
బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు, ప్రజల అభ్యున్నతికి మాగంటి సునీతమ్మ విజయం కీలకం. కెసిఆర్ మార్గదర్శకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటుంది అని విశ్వాసం వ్యక్తం చేశారు.
ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, క్యామ వెంకటేష్, తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పోలీసు వ్యవస్థ పనితీరును సమీక్షించిన సీపీ వీసీ సజ్జనర్

- అధునాతన సాంకేతికత వినియోగంతో సమర్థవంతమైన సేవలందించాలన్న సూచన
- క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి,సిబ్బందికి సీపీ సూచన
- ఉత్తమ సేవలందించిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని హామీ





**హైదరాబాద్,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గురువారం ఐసీసీసీ లోని కమిషనర్ కార్యాలయంలో వివిధ విభాగాల పనితీరును స్వయంగా పరిశీలించారు. టవర్ 'ఏ' లోని అడ్మిన్, అకౌంట్స్, ఐటీ, కంట్రోల్ రూమ్ తదితర విభాగాలను సందర్శించి సిబ్బంది పనితీరును వివరంగా ఆరా తీశారు.మెయిన్ పీసీఆర్ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాట్రోలింగ్ మేనేజింగ్ వ్యవస్థను సమీక్షించిన ఆయన, పాట్రోలింగ్ వాహనాల రియల్ టైం కదలికలను పరిశీలించారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌పై స్పందన, రెస్పాన్స్ టైమ్, సేవల సామర్థ్యం వంటి అంశాలను గమనించారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ విధి నిర్వర్తనలో నిబద్ధత, అంకిత భావం, క్రమశిక్షణ అత్యంత ముఖ్యం అని సిబ్బందికి సూచించారు. అవసరం మేరకే సిబ్బందిని వినియోగించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు.సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ పనితనాన్ని మెరుగుపరచుకోవాలని సూచించిన ఆయన, ఉత్తమ సేవలందించే సిబ్బందిని గుర్తించి వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.





# వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- ఎన్డీఆర్ఎఫ్ బోటులో లోతట్టు ప్రాంతాలకు ఎంపీ
- ప్రజలకు ఆహారం, త్రాగునీరు, పాలప్యాకెట్లు అందజేత
- వరద ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పంపిణీ జరుగుతున్న సహాయక చర్యలను పరిశీలన
- ప్రజలకు ధైర్యం చెబుతూ,శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

**హనుమకొండ,అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):**
మొంథా తుఫాను కారణంగా హనుమకొండ నగరంలో ఏర్పడిన వరద ప్రభావిత ప్రాంతాలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యటించారు. గోపాలపురం, టీఎన్జీవోస్ కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయిన నేపథ్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరంతరంగా పర్యటిస్తూ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. గోపాలపురంలో వరద ఉధృతి తీవ్రతను గమనించిన ఎంపీ, వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి బోటులో ప్రయాణిస్తూ నీట మునిగిన ప్రాంతాలకు చేరుకున్న ఆమె, ప్రజలతో మాట్లాడారు. ఇళ్లలో చిక్కుకున్న కుటుంబాలకు స్వయంగా పాల ప్యాకెట్లు, త్రాగునీరు, ఆహార ప్యాకెట్లు అందజేశారు. ప్రజలకు ధైర్యం చెబుతూ ప్రభుత్వం వారి పక్కనే ఉందని భరోసా ఇచ్చారు.
బీఆర్ నగర్ కాలనీలో డ్రోన్‌ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ జరుగుతున్న విధానాన్ని మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పరిశీలించారు. ప్రతి కుటుంబానికి సహాయం వేగంగా చేరేలా అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు ఆందోళన చెందకుండా అన్ని రకాల సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు.
వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు తాత్కాలిక ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. "ప్రతి ఇల్లు సురక్షితంగా ఉండే వరకు మేము పక్కనే ఉంటాం," అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.





# గాంధీ భవన్‌లో తెలంగాణ చిన్న, మధ్యతరహా పరిశ్రమల విభాగం ప్రారంభం

- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి

**వనపర్తి,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ చిన్న, మధ్యతరహా పరిశ్రమల విభాగం ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ అధికారి సుధాకర్, సివిల్ సొసైటీ జాతీయ అధికారి నవికా, అలాగే తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను ముందుకు ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై విస్తృత చర్చ జరిగింది. రాష్ట్ర స్థాయిలో ప్రొఫెషనల్ వర్గాల భాగస్వామ్యాన్ని పెంచడం, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగ అభివృద్ధి, యువతకు అవకాశాల సృష్టి వంటి పలు అంశాలపై సమావేశంలో ఉపయోగకరమైన సూచనలు వెలువడ్డాయి. డా. జిల్లెల ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ..ప్రొఫెషనల్ వర్గాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి. ఈ వేదిక ద్వారా యువత తమ ఆలోచనలను విధాన రూపకల్పనలో భాగస్వామ్యం చేసుకోవడం ముఖ్యం అని తెలిపారు.





# చండీశ్వర్ నగర్‌లో సిసి రోడ్ పనులకు శుభారంభం

- కాలనీ అభివృద్ధి పట్ల కాంగ్రెస్ నేతల హామీ

**నాగారం, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం నాగారం మున్సిపల్ పరిధిలో చండీశ్వర్ నగర్ కాలనీలో సిసి రోడ్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కాలనీ నివాసుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ పనులను చేపడుతున్నట్లు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాది రెడ్డి వెంకటరెడ్డి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. నాగారం అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పనిచేస్తామని, కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి పట్ల కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు. "కాలనీవాసుల సహకారం, సూచనలతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించే ప్రయత్నాలు చేస్తాం" అని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డులు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ వంటి మౌలిక వసతుల కోసం కాలనీవాసులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు. "గురువారం రోజు రోడ్ పనులు ప్రారంభం కావడం కాలనీ అభివృద్ధికి కీలకమైన మైలురాయి" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో కందాడి శ్రీనివాస్ రెడ్డి, విశ్వనాథ్ యాదవ్, బద్రు నాయక్, రాజు యాదవ్ తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొని నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు రోడ్డు పూర్తయిన తర్వాత కాలనీలోకి చేరుకోవడంలో సౌకర్యం పెరగడమే కాకుండా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# పెళ్లైన మూడు రోజులకే నవ వధువు ఆత్మహత్య!

- పురుగుల మందు తాగి ప్రాణాలు విడిచిన యువతి శ్రీలత (21)
- భర్త వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు
- హైవేపై మృతదేహంతో బంధువుల ధర్నా

**వికారాబాద్, అక్టోబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వికారాబాద్ జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెళ్లైన మూడు రోజులకే నవ వధువు శ్రీలత (21) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషం తాగిన ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది.శ్రీలత ఆత్మహత్యకు భర్త వేధింపులే కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కూతురికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్-తాండూర్ హైవేపై మృతదేహంతో బంధువులు, గ్రామస్థులు ధర్నాకు దిగారు. దీంతో రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన యువకుడి మృతదేహం కలకలం

- వరంగల్‌లోని శివనగర్ నేతాజీ స్కూల్ వద్ద ఘటన
- గీసుకొండకు చెందిన పులి అనిల్‌గా గుర్తింపు
- మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించిన పోలీసులు



**వరంగల్, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ నగరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరద ఉధృతి ప్రాణాంతకంగా మారింది. నగరంలోని శివనగర్ నేతాజీ స్కూల్ సమీపంలో ఓ యువకుడి మృతదేహం వరద ప్రవాహంలో కొట్టుకొచ్చి కనిపించింది. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు గీసుకొండకు చెందిన పులి అనిల్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వరదల్లో గల్లంతైన వ్యక్తి ఇదే అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వరదల్లో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# క్యాన్సర్‌పై అవగాహన – ఆరోగ్యమే ఆభరణం!





## ఎమ్మెల్యే జారె ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం విజయవంతం



**అశ్వారావుపేట, అక్టోబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలం గండుగులపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం గురువారం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్ బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఉదయం 9 గంటల నుంచే ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పురుషులు, మహిళలు, వృద్ధులు, ముఖ్యంగా పొగాకు, మద్యం సేవించే వారు ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు క్యాన్సర్‌కు దారితీసే అలవాట్లు, ప్రారంభ లక్షణాలు, నివారణ మార్గాలు వంటి విషయాలను ప్రజలకు వివరించారు.

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, "అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణే మా ప్రధాన లక్ష్యం. ఆర్థికంగా వెనుకబడిన వారు కూడా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం" అన్నారు. ప్రజల ఆరోగ్యమే అభివృద్ధికి మూలస్థంభమని పేర్కొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన బసవతారకం హాస్పిటల్ యాజమాన్యం, వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ధన్యవాదాలు తెలిపారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏనుగుల రాకేష్ రెడ్డి పర్యటన





- ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని ధైర్యం చెప్పిన బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు
- అలంకార్, కాపువాడ, సంతోషిమాత కాలనీల్లో సహాయక చర్యలను పర్యవేక్షించారు
- ఆహారం, త్రాగునీరు అందజేసి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు



**హన్మకొండ,అక్టోబర్30(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ నగరంలో భద్రకాళి చెరువు అలుగు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయిన నేపథ్యంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి గురువారం పర్యటించారు. అలంకార్ జంక్షన్, కాకతీయ కాలనీ, కాపువాడ, సంతోషిమాత కాలనీల్లో వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు.

వరద ఉధృతిని గమనించిన రాకేష్ రెడ్డి అక్కడి అధికారులతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల వద్దకు స్వయంగా చేరుకుని ఆహార పదార్థాలు, త్రాగునీరు అందజేశారు. బాధితులను ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం మరియు బృందాలు ఎప్పటికప్పుడు సహాయం అందిస్తున్నాయని భరోసా ఇచ్చారు.

ప్రజల సమస్యలను ఓర్పుతో విని, తక్షణ ఉపశమన చర్యలతో పాటు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని ఏనుగుల రాకేష్ రెడ్డి తెలిపారు. వర్షాలు కొనసాగుతున్నప్పటికీ సహాయక చర్యలు నిరంతరంగా జరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బంగారం, వెండి ధరలు పెరుగుదల దిశగా - ఆందోళనలో వినియోగదారులు

అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ బలహీనత, ముడి చమురు ధరల పెరుగుదల, మధ్యప్రాచ్యంలో రాజకీయ ఉద్రిక్తతలతో బంగారం, వెండి ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సహా ప్రధాన నగరాల్లో ఈ రోజు బంగారం ధర రికార్డు స్థాయికి చేరింది. స్థానిక బంగారు వ్యాపారుల ప్రకారం, 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ. 63,900 దాటగా, 22 క్యారెట్ బంగారం రూ. 58,600 వద్ద నమోదైంది. అదే సమయంలో వెండి ధర కిలోకు రూ. 78,200కు పెరిగింది. దీపావళి ముందు రోజుల్లో ధరలు ఈ స్థాయిలో పెరగడం వినియోగదారులను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వినియోగదారులు బంగారం కొనుగోళ్లను తాత్కాలికంగా వాయిదా వేస్తుండగా, నగల దుకాణాలు ఆఫర్లు, రాయితీలతో కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. మార్కెట్ నిపుణులు బంగారం ధరలు వచ్చే వారం కూడా పెరుగుతూనే ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర 2,400 డాలర్ల దాటే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఇది పెట్టుబడిదారులకు లాభదాయకమయినా, సాధారణ వినియోగదారులకు మాత్రం భారమవుతుంది.



# తెలంగాణ ఔషధ పరిశ్రమకు కొత్త ఊపు .. అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులు పెరుగుతున్నాయి



తెలంగాణ ఔషధ పరిశ్రమ మరింత బలపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు ప్రపంచస్థాయి సంస్థలు స్పందిస్తున్నాయి. తాజాగా ఐదు అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్ ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయి. వీటిలో అమెరికా, స్విట్జర్లాండ్, జపాన్ దేశాల కంపెనీలు ఉన్నాయని అధికారులు వెల్లడిరచారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల కోసం సుమారు 1,800 ఎకరాల భూమిని కేటాయించగా, పెట్టుబడుల మొత్తం విలువ రూ. 9,000 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే సుమారు 25,000 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఫార్మా సిటీని అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. నీరు, విద్యుత్, రవాణా, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పారిశ్రామిక శాఖ అధికారులు తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో భారత ఔషధ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ తెలంగాణకు కొత్త అవకాశాలను తెస్తుందని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఫార్మా సిటీ పూర్తి స్థాయిలో అమలు అయితే తెలంగాణ ప్రపంచ ఫార్మా మ్యాప్‌లో కీలక స్థానాన్ని సంపాదిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మొంథా తుఫాన్...

# రైతుల గుండెల్లో రక్తపు వర్షం!



వరదల్లో ఈదుతున్న యువకుడు



(మొదటి పేజీ తరువాయి)

పిల్లలు పైకప్పుపై వణుకుతూ... పెద్దలు తలుపులపై కూర్చుని సహాయం కోసం ఎదురుచూశారు.

"నీళ్లు ఎక్కడికి వెళ్లినా... మేము ఎక్కడికీ వెళ్లలేకపోయాం!" అని ఓ మహిళ చెప్పిన మాటలు హృదయాన్ని తాకాయి.

వరంగల్ బి ఆర్ నగర్, ఎర్రమనుగల్, మట్టికల్, కాజీపేట పరిసరాలు కూడా నీట మునిగాయి.

ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, మున్సిపల్ బృందాలు ఉదయం వరకు శ్రమించాయి.

బోట్లతో వృద్ధులు, పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

"ఇంట్లో ఉన్న మందులు, పత్రాలు, పాఠశాల పుస్తకాలు అన్నీ నీటిలో పోయాయి" అని విద్యార్థి వినయ్ కళ్లలో కన్నీళ్లు కదిలాయి.



వరంగల్ అండర్ బ్రిడ్జ్ వద్ద

**పల్లెలో... రాత్రి కన్నీటి వర్షం**

పట్టణం రోదిస్తుంటే, పల్లెలో దుఃఖం పెల్లుబికింది. పత్తి మొక్కలు కూలిపోయాయి. వరి గింజలు మునిగిపోయాయి.వేలేరు మండలంలో రైతు రాములు గొంతు గర్జించింది. ఆ గర్జనలో ఆరు నెలల కష్టం,రూ. లక్షల అప్పు, భార్య కళ్లల్లో ఆశలు... అన్నీ మునిగిపోయాయి. "ఐకేపీ సెంటర్ వద్ద ఆరబోసిన ధాన్యం... ఇప్పుడు మా పిల్లల ఆకలి కోసం ఉండాల్సిన గింజలు...తడిసి పాడైపోయాయి. ఇంట్లో ఒక్క ముద్ద కూడా లేదు!" అని ఆయన గొంతు తడిసి ముద్దయింది.

గీసుకొండ మండలంలో గంగాధర్... ఆ రాత్రి తన ఐదేళ్ల కొడుకును భుజంపై ఎత్తుకొని పైకప్పుపై నిలబడ్డాడు. కింద పొలం మునిగిపోతోంది. "నాన్నా... మా ఆవు ఎక్కడ?" అని పిల్లవాడు అడిగాడు.గంగాధర్ మాట్లాడలేకపోయాడు.ఆవు... ఎద్దు... గొర్రెలు... అన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. "నా కొడుకు రేపు పాలు తాగాలంటే...ఆవు ఉండాలి. ఇప్పుడు ఏమీ లేదు!" అని ఆయన కన్నీళ్లు ఆగలేదు.

**వాగులు... రోదనలా పొర్లాయి!**

పలుచోట్ల... రోడ్లు ఛిన్నాభిన్నం. రవాణా స్తంభించింది. రైతులు తమ పొలాలకు చేరుకోలేక... దూరంగా నిలబడి కన్నీటితో చూస్తున్నారు. "మా పంటలు కాపాడుకోవడానికి ఒక్క అడుగు కూడా వేయలేకపోయాం!" అని ఒక రైతు గుండెలు విలవిలలాడాడు.

**చెరువులు పొంగాయి...పశువులు అర్ధరాత్రి ఏడ్చాయి!**

షెడ్లు మునిగాయి. ఆవులు గల్లంతు. రైతులు రాత్రంతా నీటిలో నడిచి, చేతులు రక్తం కక్కుతూ జంతువులను వెతికారు. "మా ఆవు... మా లక్ష్మి... ఎక్కడ పోయింది?" అని ఒక మహిళ ఏడుస్తూ పడిపోయింది. మేత లేదు. పాలు లేవు. పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు.

**ఇళ్లలోకి నీరు... పిల్లలు పైకప్పుపై భయంతో వణుకుతున్నారు!**

లోతట్టు గ్రామాల్లో రాత్రి 2 గంటలకు నీరు ఇంట్లోకి ప్రవేశించింది. తల్లులు పిల్లలను ఎత్తుకొని పైకప్పుపైకి పరుగులు. "అమ్మా... చలి!" అని చిన్నారులు ఏడుస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు బోట్లతో వచ్చి ఆహారం, నీరు అందించాయి. ఎన్డీఆర్ఎఫ్ జవానులు రాత్రంతా రెస్క్యూ చేశారు. కానీ... రైతుల గుండెల్లో ఆ రాత్రి గాయం శాశ్వతంగా మిగిలిపోయింది.

**"మా జీవితమే మునిగిపోయింది... పంట కాదు!"**

అధికారులు నష్టాలు అంచనా వేస్తున్నారు. కానీ రైతుల మాటలు గుండెల్ని పిండేస్తున్నాయి:"ఈ పంట కోసం అప్పు చేశాం... పిల్లల చదువు ఆపేశాం... ఇప్పుడు ఏమీ లేదు!""రుణం ఎలా తీర్చాలి? పిల్లల్ని ఎలా పోషించాలి?"

"మరోసారి విత్తనం వేయాలంటే... ఒక్క రూపాయి కూడా లేదు!"

**మళ్లీ లేచే ఆశ... కానీ ఆధారం లేకుండా!**

పాడైపోయిన పత్తి మొక్కల మధ్య నిలబడి... రైతులు మౌనంగా ఏడుస్తున్నారు. ఆకాశం స్పష్టమైంది. కానీ వారి మనసుల్లో ఇంకా మొంథా గర్జిస్తోంది. "ప్రభుత్వమా... మమ్మల్ని ఆదుకో! మా కళ్లల్లో ఆశలు ఆరిపోకముందే!" అని గుండెలు పగిలి ఏడుస్తున్నారు.

## బరువెక్కిన గుండెతో...రైతుల డిమాండ్

48 గంటల్లో పూర్తి నష్ట అంచనా చేయాలి – ఒక్క రోజు కూడా ఆలస్యం చేయొద్దు! ఎకరాకు ₹50,000 తక్షణ పరిహారం ఇవ్వాలి – ఇది డబ్బు కాదు... మా జీవితం! విత్తనాలు, ఎరువులు, రుణ రాయితీలు అందించి మళ్లీ నాటే ధైర్యం కల్పించాలి! పశువులకు మేత, షెడ్లు, వైద్యం ఇచ్చి మా రెండో కుటుంబాన్ని కాపాడాలి! వరద నీటిని తొలగించే పంపులు, యంత్రాలు అందుబాటులో ఉంచి మా పొలాలు మళ్లీ పచ్చగా మార్చాలి! పిల్లల చదువు, కుటుంబ ఆహార భద్రత కాపాడాలి – ఇది కేవలం పంట కాదు... మా భవిష్యత్తు! మొంథా వెళ్లిపోయింది... కానీ రైతుల గుండెల్లో ఆ రాత్రి ఇంకా జీవించి ఉంది. ప్రభుత్వమా... ఈ ఏడుపు విను! ఈ కన్నీళ్లు తుడుచు! మా ఆశల్ని మళ్లీ పచ్చగా మార్చు!





## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుంది

- ప్రజా హామీలు నెరవేర్చాం
- రేషన్ కార్డులు, నాణ్యమైన బియ్యం పంపిణీ
- ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 30:

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించబోతుందని, ప్రజల విశ్వాసం తమ పక్షాన ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిరదని తెలిపారు. ''జూబ్లీహిల్స్ మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై సంతోషంగా ఉన్నారు'' అని ఉత్తమ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎలాంటి రాజీ పడలేదని అన్నారు. ప్రజలకు అందజేసిన రేషన్ కార్డులు, పంపిణీ చేసిన నాణ్యమైన బియ్యం కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని వివరించారు. ఉపఎన్నికలో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ''కాంగ్రెస్ ప్రజలతో ఉన్న పార్టీ, ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ప్రభుత్వం'' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



## ముందు బీమా చెల్లించండి.. తర్వాతే ఏమైనా!: సుప్రీంకోర్టు

ఈ రోజుల్లో దాదాపు అందరూ బీమా తీసుకుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో ప్రమాదం జరిగినప్పుడు.. కొన్ని కారణాలను చూపిస్తూ బీమా సంస్థలు పరిహారం చెల్లించకుండా తప్పించుకుంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని 'వాహనం రూట్ ఉల్లంఘన జరిగినా కూడా, ప్రమాద బాధితుడికి బీమా కంపెనీలు పరిహారం చెల్లించాల్సిందే' అంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో..వాహనం రూట్ మారిందని ప్రమాద బాధితులకు బీమా కంపెనీ పరిహారాన్ని తిరస్కరించకూడదు. సాంకేతిక అంశాలను పరిగణలోకి తీసుకుని బీమాను తిరస్కరించలేరు. ప్రమాద బాధితుడికి న్యాయం చేయడమే బీమా ముఖ్య ఉద్దేశం. బీమా చెల్లించిన తరువాత.. ఏవైనా అవకతవకలు ఉంటే.. రూల్స్ ఉల్లంఘించిన వాహన యజమానిపై లేదా డ్రైవర్ నుంచి రికవరీ చేసుకోవచ్చు. కాబట్టి ముందుగా ప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది.





## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుతో కాంగ్రెస్‌కి కనువిప్పు కలగాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- బోరబండలో మాగంటి సునీత గోపీనాథ్‌కు మద్దతుగా ప్రచారం

హైదరాబాద్, అక్టోబర్ 30 :



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కలగాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆకాంక్షించారు. బోరబండ డివిజన్ ఇంచార్జ్‌గా ఆయన గురువారం బాబా సైలానీ నగర్‌లో మాగంటి సునీత గోపీనాథ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీత కుమార్తెలు దీక్షిత, అక్షితలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ ''మన బతుకులకు భరోసానిచ్చిన పార్టీ బీఆర్ఎస్. కానీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించిన పార్టీ కాంగ్రెస్. హామీలను నిలబెట్టుకోలేక ప్రజలకు మొండి చెయ్యి చూపింది,'' అని విమర్శించారు. నవంబర్ 11న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పక్షాన నిలబడి, 'కారు' గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in